క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో శుక్రవారం రాత్రి అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో గస్తీ నిర్వహిస్తుండగా వెంకటగిరి పట్టణానికి చెందిన అరవ సురేష్ ఆటోలో బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనంతోపాటు అందులో ఉన్న 1021 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరుకు చెందిన యాగాని చార్లెస్‌ఫిన్నీ, తబిత వివాహం శనివారం స్థానిక చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ప్రాంగణంలోని వికాస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, ఎంపీటీసీ కుమారస్వామి, పోలయ్య, గురవయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి బంగారు చీర అలంకరణ



వెంకటగిరి (సైదాపురం) : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారుచీర, కిరీటం అలంకరించి భక్తులకు దర్శనకల్పించారు. పుష్కర కుంభాభిషేక వేడుకల్లో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి గోపూజ, ధనపూజ, కలశ స్థాపన, సకల దేవతా ఆహ్వానం, మూల మంత్రం, నవగ్రహ జపం, చండీనవార్చన, సప్తశతీపారాయణం, లఘు పూర్ణాహుతి చేపట్టారు.

గుండెపోటుతో డిజిటల్ అసిస్టెంట్ మృతి



వీరయ్యకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

డక్కిలి : మండలంలోని డి.వడ్డిపల్లి గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ తాటి మల్ల వీరయ్య(43) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ గోనురాజశేఖర్, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి డిజిటల్ అసిస్టెంట్ వీరయ్య ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆయన భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ అనూరాధ, సీనియర్, జూనియర్ సహాయకులు సిరాజ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ గోపాల్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతనికి 70 ఏళ్లు ఉంటాయని, చేతి మీద జయలక్ష్మీ అన్న పచ్చ బొట్టు ఉందని, పుసుపు రంగు చొక్కా, కాషాయ రంగు పంచె ధరించినట్టు తెలిపారు. మృతదేహాన్ని గూడూరు ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 9100244099, 9440796343లలో సంప్రదించాలని సూచించారు.

కోట మండలంలో

కోట: మండలంలోని కొండుగుంట వద్ద అటవీ ప్రాంతంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి వీఆర్వో పోలయ్యకు సమాచారం ఇచ్చారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పవన్‌కుమార్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద ఆధారాలు లేకపోవడం, స్థానికులు గుర్తించక పోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి రూరల్ : ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణంగా నిలిచిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం వెంకటగిరిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా కాశీపేట కూడలి వద్ద ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 9వ బెటాలియన్ సిబ్బంది, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో 9వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్‌ఖన్నా, సీఐ ఏవీరమణ, పులుకొల్లు రాజేశ్వరరావు, గంగోటి నాగేశ్వరరావు, ఎంపీపీ తనుజారెడ్డి, ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

'మాది మంచి ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోంది.. రూ.లక్షలతో గ్రామాల్లో పనులు చేయిస్తున్నాం..' అని ఎమ్మెల్యే సమావేశాల్లో ఊదరగొడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కనీస వసతులు లేక ఎస్టీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. పక్కా ఇళ్లు లేక గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు, నాయకులకు తమ గోడును వెల్లబోసుకున్నా ఫలితం లేదని వారు వాపోతున్నారు.



శిథిలావస్థకు చేరిన పక్కాగృహం

- అభివృద్ధికి నోచుకోని కలుజుమిట్ట ఎస్టీ కాలనీ
- తాగునీటి కోసం తప్పని తిప్పలు
- ఉరుస్తున్న పక్కాగృహాలు
- పట్టించుకోని అధికారులు



పొలాల నుంచి తాగు నీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు, (ఇన్‌సెట్) గిరిజనులు ఉంటున్న పూరి గుడిసె

దొరవారిసత్రం : మండలంలోని కొత్తపల్లి పంచాయతీ కలుజుమిట్ట గిరిజన కాలనీలో 100 కుటుంబాలు ఉన్నాయి. సుమారు 450 మంది జనాభా ఉంది. ఇక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మంచినీటి పథకం ఉన్నప్పటికీ ఫలితం లేదు. అందులో నుంచి వచ్చే నీరు తాగడానికి పనికిరాకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలాల్లోని బోర్ల నుంచి తెచ్చుకుంటున్నారు. కాలనీకి సరైన రోడ్డు లేదు. అత్యవసర సమయాల్లో 108 వాహనం కూడా వచ్చే అవకాశం లేని విధంగా గుంతలతో కూడిన రోడ్డే వారికి దిక్కు. గిరిజన కుటుంబాలు ఉంటున్న ప్రాంతం ఫారెస్ట్ భూమి కావడంతో ఎవరికీ పట్టాలు లేవు. దీంతో పక్కా ఇళ్లు మంజూరు కాలేదు. 2009–10లో వీఆర్వో స్వచ్ఛంద సేవా సంస్థ 44 జాయింట్ పక్కాగృహాలను నిర్మించింది. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. కొన్ని ఇళ్లు పూర్తిగా దెబ్బతినడంతో వాటిల్లో ఉండలేక పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. మరి కొందరు శ్లాబ్‌లపై టార్పాలిన్ పట్టలు కప్పుకుని కాలం వెల్లదీస్తున్నారు. రెండేళ్ల క్రితం ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కలుజుమిట్ట గిరిజన కాలనీని సందర్శించారు. ఆయన ఆదేశాలతో హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపి చేతులు దులుపుకున్నారు.



కాలనీలో సీసీ రోడ్డు దుస్థితి

పక్కాగృహాలు నిర్మించాలి



మా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలకు ఎక్కడ కూలిపోతాయోనని భయంతో గుడిసెల్లో ఉంటున్నాం. ఈ ప్రాంతం ఫారెస్టు భూములని అధికారులు పట్టాలు ఇవ్వడంలేదు. దీని వల్ల ప్రభుత్వం మంజూరు చేసే పక్కాగృహాలు మాకు అందడం లేదు.

– అద్దూరు బుజమ్మ, కలుజుమిట్ట ఎస్టీ కాలనీ

సాగు భూములకు పట్టాలు కల్పించాలి



పది కుటుంబాల వారం 50 ఏళ్లగా 30 ఎకరాల వరకు భూముల్లో సాగు చేసుకుంటున్నాం. పట్టాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితంలేదు. ఫారెస్టు భూమి అని పట్టాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచే ఏ సాయమూ అందడంలేదు.

– బండి బుజ్జమ్మ, కలుజుమిట్ట గిరిజన కాలనీ

తాగేందుకు కాలనీలో నీళ్లు



కలుజుమిట్ట కాలనీలో నీటి పథకం ఉంది. ఆ నీరు తాగేందుకు పనికి రావడంలేదు. కొన్నేళ్ల నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బావి నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. మంచి నీళ్ల పడే ప్రాంతంలో బోరు వేసి పైపులైను ద్వారా నీరు అందించి మా కష్టాలు తీర్చాలి. – అద్దూరు నాగమ్మ, మేకల సుబ్బమ్మ, కలుజుమిట్ట ఎస్టీ కాలనీ

'ఎండలో బయట తిరగరాదు'



ప్రతిజ్ఞ చేస్తున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

చిల్లకూరు : రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోందని, ప్రజలు అత్యవసరమైతేనే బయట తిరగాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డీఎస్పీ గీతాకుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటశ్వర్లు తెలిపారు. వారు శనివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మా ట్లాడుతూ వేసవిలో కాటన్ దుస్తులు ధరించాలన్నారు. ఓఆర్ఎస్, తగినంత నీరు తరచూ తాగాల ని సూచించారు. అనంతరం సీవీసీ పార్కులో మొ క్కలు నాటారు. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు.

20న మెగా జాబ్ మేళా

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఆర్ డబ్ల్యూ కళాశాలలో ఈ నెల 20న లక్ష్య ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హనుమంతరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులని, ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు.

చలివేంద్రం ప్రారంభం

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగులో అటవీశాఖ కార్యాలయం వద్ద శనివారం అధికారులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. రేంజర్ రవీంద్రబాబు మాట్లాడుతూ కూడలిలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు, పాదచారులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సాసర్ పీట్‌లో మంచినీరు నింపుతున్నట్లు పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం



కరిమాణిక్యస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి

- పోటెత్తిన భక్తులు
- భక్తులకు అన్నదానం

నాయుడుపేట టౌన్ : తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథాన్ని లాగారు.కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలు కూడళ్ల వద్ద దాతలు మజ్జిగ, రస్నా పానీయాలు పంపిణీ చేశారు. అదేవిధంగా భారీగా అన్నదానం చేశారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం చేశారు. తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి మండపంలో కొలువుదీర్చి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం రథంపై కొలువుదీర్చారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య రథోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఆలయ సమీపంలో తుమ్మూరు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు అన్నదానం చేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఆంజనేయ రాజు, అలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, గ్రామ పెద్దలు ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు పార్వేట ఉత్సవం

తుమ్మూరు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి తెలిపారు. ఉదయం ఆలయం వద్ద చప్పర ఉత్సవంతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయని వెల్లడించారు.



అన్నదానం నిర్వహిస్తున్న తుమ్మూరు యువత

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు



నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : అండగా ఉంటామని, ఎవ్వరూ అధైర్య పడొద్దని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఆయన శనివారం వాకాడులోని తన నివాసంలో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాడులు, అరాచకాలు, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. ఆ పార్టీ నాయకులు సొంత ధనార్జనే ధ్యేయంగా సహజ వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. 2027లో జెమిలీ ఎన్నికలు రావడం ఖాయమని, గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి మరోసారి విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ భారతదేశ సత్తాను చాటి చెప్పిందన్నారు. ఆయన ఇండియన్ ఆర్మీకి సెల్యూట్ చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



వెంకటగిరిలో మొక్కలు నాటుతున్న జడ్జి విష్ణువర్మ



డీవీ సత్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కోట/వెంకటగిరి రూరల్/ఓజిలి/దొరవారిసత్రం : స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని వివరించారు. అనంతరం స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. వెంకటగిరిలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. వెంకటగిరి పట్టణంలోని పోలిశెట్టిగుంట పార్కు వద్ద ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.2 కోట్లతో పార్కును అభివృద్ధి చేస్తామని తెలిపారు. అదేవిధంగా వెంకటగిరి మండలంలోని కలపాడులో ఎంపీడీవో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కోటలో ఎంపీడీవో దిలీప్‌కుమార్, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో కిరణ్, ఓజిలిలో కుందాం సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్ రెడ్డి, సర్పంచ్ రమణయ్య, ఈవోపీఆర్డీ రేణుక, వేలూరు అనీల్‌రెడ్డి, ఎల్లు గురుతేజ, కోటి, దొరవారిసత్రంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన, ఏపీఎం మునిరాజ, ఏపీఓ ఉషారాణి, ఏవో రఘురామయ్య, ఎస్‌ఐ అజయ్‌కుమార్, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సీఐ ఏవీ రమణ, కలపాడు సర్పంచ్ ప్రసాద్, టీడీపీ నేతలు పులుకొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనాల అడ్డగింత



వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ

చిల్లకూరు : సాగరమాల రోడ్డు పనులకు మట్టి, గ్రావెల్ తరలించే భారీ వాహనాలతో ఇబ్బందులు పడుతున్నామని మోమిడి గ్రామస్తులు వాపోయారు. వారు శనివారం వాహనాలను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని భూముల నుంచి మట్టి, గ్రావెల్‌ను భారీ వాహనాలతో తరలిస్తున్నారని తెలిపారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని తెలిపారు. ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని స్థితికి చేరినట్టు పేర్కొన్నారు. దెబ్బతిన్న కల్వర్టుల వద్ద గ్రావెల్ వేయాలని కోరితే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు తమకు సంబందం లేదని చెబుతున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డును బాగు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈదూరు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భవితలో ప్రత్యేక విద్య

వాకాడు : వాకాడు భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్య అందిస్తున్నట్టు ఎంఈవో నసీం అలీ తెలిపారు. ఆయన శనివారం ఐఈఆర్టీలు సునీత, జగన్‌మోహన్‌రావుతో కలిసి గ్రామాల్లో సర్వే చేసి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించారు. ప్రభుత్వం దివ్యాంగ పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు, అలవెన్సులు అందజేస్తుందని తెలిపారు. సమగ్ర శిక్షణ అందిస్తుందన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో శ్రీనివాసులు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి ఎంపీడీవోగా కె.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నమయ్య జిల్లా గాలివీడు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న డీజే వినీల్‌కుమార్ డిప్యూటీ ఎంపీడీవోగా కొనసాగనున్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

చిట్టమూరు: మండలంలోని తాడిమేడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు శనివారం పంచాయతీ కార్యదర్శి శంకర్ మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే ప్రదేశంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు నీడ ఏర్పాటు చేశామన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని మన్నూరులో గిరిజనుల శ్మశానాన్ని ఆక్రమించిన జడపల్లి రమణయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని యానాది సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపలి చెంచు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఎస్‌ఐ గోపికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్మశానం ఆక్రమణపై ప్రశ్నించిన గిరిజనులను రమణయ్య కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు.

'మా భూమి లాక్కున్నారు'

చిల్లకూరు : మా భూమిని దౌర్జన్యంగా లాక్కున్నారు. న్యాయం చేయండి అని డక్కిలి మండలం తురకపల్లికి చెందిన డక్కిలి వరలక్ష్మీ, తిరుపాలు వాపోయారు. వారు శనివారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము నెల్లూరులోని ఒక మాల్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు పూర్వీకుల నుంచి వచ్చిన 1.49 ఎకరాల భూమిని రెండేళ్ల క్రితం మిట్టపాళెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి కౌలుకు ఇచ్చామన్నారు. అతను ఆ భూమిని ఆక్రమించుకుని దిక్కున్న చోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నాడని వాపోయారు. న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. స్పందించిన సబ్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన

రాపూరు: మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం మొదటి శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. 6 గంటలకు పూలంగి సేవ, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ప్రభుత్వ భూమిలో జామాయిల్ చెట్ల నరికి వేత



కొయ్యలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

చిల్లకూరు : కడివేడు రెవెన్యూ పరిధి ఆముదాలకండ్రిగలోని ప్రభుత్వ భూమిలో వున్న జామాయిల్ చెట్లను శనివారం నరికేశారు. ఇక్కడ సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు బడాబాబులు ఆక్రమించుకుని జామాయిల్ సాగు చేస్తున్నారు. దీనిపై పలుమార్లు కథనాలు వెలువడడంతో అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొంతమందిపై కేసులు నమోదు చేశారు. కొద్దిరోజులు మిన్నకుండిన అక్రమార్కులు మళ్లీ జామాయిల్ మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి కోత దశకు వచ్చాయి. సుమారు 50 ఎకరాల్లో వున్న చెట్లను నరికి కొయ్యలను తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాసులు వివరణ ఇస్తూ వీఆర్వో శ్రీనివాసులును అక్కడికి పంపి జామాయిల్ కొయ్యలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కోట: విద్యానగర్ కొత్తపాళెం రోడ్డులో ఉంటున్న రవీంద్రరెడ్డి శనివారం మధ్యాహ్నం తన ఇంటి ముందు నిలిపిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు శనివారం ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.